క్లుప్తంగా

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొండపి: మండలంలోని అర్హత కలిగిన బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 మండలంలో 250 యూనిట్ల రుణాలు మంజూరు అయ్యాయన్నారు. వెనుకబడిన తరగతులు బీసీ లబ్ధిదారులు, ఆర్థికంగా బలహీనమైన విభాగం గల ఈడబ్ల్యూఎస్ లబ్ధిదారులు ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ ద్వారా జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్లైన్లో నిబంధన మేరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు దగ్గరలోని సచివాలయం సందర్శించి రేషన్ కార్డ్ ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ వివరాలతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ


చిల్డ్రన్స్ హోంను తనిఖీ చేస్తున్న అధికారులు బాలప్రభాకర్

పామూరు: చిల్డ్రన్స్‌హోం నిర్వాహకులు హోంలోని బాలికలు, బాలుర సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా పర్యవేక్షణ అధికారి పీ బాలప్రభాకర్ అన్నారు. మండల కేంద్రం పామూరులోని కరుణ గరల్స్ హోం, పామూరు చిల్డ్రన్స్ బాలుర హోంను గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తనిఖీ చేశారు. ఈసందర్భంగా హోంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం హోంలోని అనాథ, వీధి బాలలతో మాట్లాడి హోంలో మౌలిక వసతులు, భోజనం, బాలికల సంరక్షణ, ఆరోగ్యం ఇతర అంశాలపై మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు కే.శేఖర్‌బాబు, ఐ.లక్ష్మి, రత్నప్రసాద్, సంస్థ నిర్వాహకులు నూనె ప్రసాద్, నూనె వేణి, బాల బాలికలు ఉన్నారు.

వైఎస్సార్ యాంత్రీకరణ పనిముట్ల తనిఖీ


వ్యవసాయ పనిముట్లను పరిశీలిస్తున్న ఏడీఏ బృందం

హనుమంతునిపాడు: రైతు సేవా కేంద్రాల్లో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతు గ్రూపులకు రాయితీపై అందజేసిన యంత్ర పరికరాలు, పనిముట్లను గురువారం అధికారులు పరిశీలించారు. ఈ పథకం ద్వారా 14 కేంద్రాల్లో 15 గ్రూపులకు రైతులకు ఇచ్చిన ట్రాక్టర్లు, ట్రాలీలు, నాగళ్లు, గొర్లు, పవర్ స్ప్రేయర్‌లు, రోటవేటర్లు, వ్యవసాయ పనిముట్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ బాలాజి నాయక్ మాట్లాడుతూ రైతు తీసుకున్న పనిముట్లు ఉన్నాయా లేవా ? వాడుతున్నారా లేదా? అని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఎంపీఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పురోగతిపై పీడీ సమీక్ష

కనిగిరిరూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ప్రాజెక్టు డైరెక్టర్ (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) గంగవరపు జోసఫ్ అన్నారు. స్థానిక ఎన్‌ఆర్ఈజీఎస్ క్లస్టర్ కార్యాలయంలో 7 మండలాల ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ జీ జోసఫ్ మాట్లాడుతూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులు గుర్తించి.. నిర్ణత సమయంలో నివేదికలు తయారు చేసి పూర్తి చేయాలన్నారు. క్లస్టర్‌లోని మండలాల వారిగా జరుగుతున్న, జరిగిన ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, ఏపీఓలు, ఏసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

లేఆవుట్‌ల అనుమతులు సులభతరం


మాట్లాడుతున్న కమిషనర్, చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాల, లే ఆవుట్‌లు సులభతరం కానున్నట్లు కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో గురువారం జీవోఎస్ నంబర్ 5 గూర్చి అవగాహన కల్పించి, అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జీవోఏ నంబర్ 5 ప్రకారం 300 చదరపు అడుగుల విస్తీర్ణం పైన గల భవనాలకు కూడా మున్సిపాలిటిలోనే అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నూతన గృహ యజమానులు తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలన్నారు. ప్లాన్ అప్రూవల్ లేని గృహాలకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీపీఎస్ సువర్ణ కుమార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్ తమ్మినేని సుజాత, పులి శ్రీను, పి అరుణోదర్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అక్రమ బ్యారన్‌లు!


అనుమతి లేకుండా నూతనంగా నిర్మించిన బ్యారన్


అక్రమంగా బ్యారన్ నిర్మించిన వారికి నోటీసు ఇస్తున్న బోర్డు సిబ్బంది (ఫైల్)

- ఇష్టారాజ్యంగా అక్రమ బ్యారన్ల నిర్మాణం
- నూతన బ్యారన్లకు అనుమతి ఇవ్వని అధికారులు
- పంచాయతీకి దాదాపు 10 అక్రమ బ్యారన్ల నిర్మాణం
- ఆందోళనలో పొగాకు రైతులు

కొండపి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. దీనికి తోడు అధికారులు వంతపాడటంతో యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు కొందరు. అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా బ్యారన్‌లు నిర్మించుకుంటున్నారు కొందరు రైతులు. ఒక గ్రామానికి దాదాపు పది అక్రమ బ్యారన్లు, మరికొన్ని గ్రామాల్లో 25 వరకు అక్రమ నిర్మాణాలుచేపట్టారు. 2024–25 సీజన్లో జిల్లా పరిధిలో 105.27 మిలియన్ కిలోల పొగాకు అనుమతి లభించింది. సాగు విస్తీర్ణం సుమారు 64 వేల హెక్టార్లు ఉన్నాయి. జిల్లాలోని రైతులు 28,880 మంది పొగాకును సాగు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం అనుమతించిన బ్యారన్ల సంఖ్య 24,130 ఉంది. వాస్తవానికి గతేడాది పొగాకు రైతులు అత్యధిక లాభాలను చూశారు. ఇతర రాష్ట్రాల్లో పొగాకు పంట నష్టపోవడం వలన అదృష్టశావత్తు పొగాకు కేజీ ధర రూ.250 నుంచి గరిష్ట స్థాయి రూ.360 వరకు చేరుకుంది. దీంతో గత సంవత్సరం పొగాకు రైతుల పంట పండింది. ఇదే అదునుగా భావించిన రైతులు గతంతో పోలిస్తే అనుమతించిన మేర కన్నా ఎక్కువగా పొగాకు సాగు చేస్తున్నారు.

అక్రమ బ్యారన్ల నిర్మాణం..

అక్రమ బ్యారన్ నిర్మిస్తే చట్ట రీత్యా నేరమని అధికారులు అవగాహన కల్పిస్తున్నా, రైతులు అవేమి పట్టించుకోకుండా ఇష్టారీతిగా అక్రమ బ్యారన్‌ల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణ సమయంలో అధికారులు నోటీసులతోనే వదిలేయడంతో ఏమి కాదన్న ఉద్దేశంతో దాదాపు రూ.10 లక్షలు పెట్టి నిర్మించారు. అనధికారికంగా నిర్మించిన వాటిపై పంచాయతీ సెక్రటరీకి తహసీల్దార్ ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. దీంతో మేము కూల్చివేయాల్సి వస్తే దాదాపు రూ.10 లక్షల మేర నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంతో పోల్చుకుంటే రెట్టింపైన పెట్టుబడి..

గత సీజన్‌తో పోల్చుకుంటే పొగాకు సంబంధించి పెట్టుబడి డబుల్ అయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిసి నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వలన పొగాకు సరైన రంగు రావడం లేదని, దానికి తోడు పెట్టుబడి ఖర్చులు ఎక్కువ అవ్వడం వలన ఎకరాకి 20 నుంచి 30 వేల వరకు పెట్టుబడులు పెరిగాయని, ఒక బ్యారన్ కి సరాసరిగా రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు నిర్మించిన వాటికి అధికారులు అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అనధికారిక బ్యారన్‌లు నిర్మించిన వారిపై చర్యలు..



కొండపి బోర్డు పరిధిలో 7500 హెక్టార్ల సాగుకు అనుమతి ఉంది. రైతులు దాదాపు పదివేల హెక్టార్ల వరకు సాగు చేశారు. బోర్డు పరిధిలో 2900 మంది రైతులకు బ్యారన్ల మాత్రమే అనుమతి ఉంది. అనధికారికంగా నిర్మించవద్దని రైతులకు ముందుగానే తెలియజేశాం. కొండపి బోర్డు పరిధిలో దాదాపు 100 అక్రమ బ్యారన్‌ల నిర్మాణాలు జరిగాయని మా దృష్టికి వచ్చింది. వారికి నిర్మాణ దశలోనే నోటీసులు అందించాం.

– జి. సునీల్ కుమార్, వేలం నిర్వహణ అధికారి

పారదర్శకంగా పింఛన్ల తనిఖీ

పామూరు: హెల్త్ పెన్షన్స్ తనిఖీ వైద్యబృందం పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ బొల్లినేని సురేష్ అన్నారు. మండలంలోని వగ్గంపల్లె, చిలంకూరు, చింతలపాలెం, రావిగుంటపల్లె, పడమటి కట్టకిందపల్లె సచివాలయాల పరిధిలోని 12 హెల్త్ పింఛన్లను ఎంపీడీఓతో పాటు ఒంగోలుకు చెందిన వైద్యబృందం గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఒంగోలుకు చెందిన డాక్టర్ బీ ఆంజనేయులు, డాక్టర్ సౌజన్యలు పెన్షనర్స్‌తో మాట్లాడి వారి ఫిట్‌నెస్, ఆరోగ్య సమస్యలను పరిశీలించి, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమలో డాక్టర్ ఎం.విజయ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

పొన్నలూరు: మండలంలోని రావులకొల్లు, పైరెడ్డిపాలెం, ఉప్పలదిన్నె, పొన్నలూరు, ముప్పాళ్ల గ్రామాల్లో గురువారం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో వైద్య బృందం ఆరోగ్య పింఛన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రాలతో పాటు పలు వివరాలను సేకరించి నమోదు చేకున్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగజ్యోతి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.


పింఛన్‌దారులతో మాట్లాడుతున్న వైద్య బృందం

అహింసావాది మహాత్మా గాంధీ


గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్


గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- గాంధీజీ వర్ధంతి వేడుకలు
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు

సింగరాయకొండ: అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం రావటంలో ప్రధాన భూమిక వహించిన గొప్ప నేత మహాత్మా గాంధీజీ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం గాంధీజీ వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీజీని ఆదర్శంగా తీసుకుని హింసను విడనాడాలని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, గాదంశెట్టి గుప్తా, సోమిశెట్టి సురేష్, రావినూతల అంకయ్య, బత్తిన మదన మనోహర్, పఠాన్ రియాజ్, పాలూరి శ్రీనివాసులరెడ్డి, గొల్లపోతు గోవర్ధన్, షేక్ కరిముల్లా, అరేటి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్ముడి మార్గం అనుసరణీయం

కనిగిరిరూరల్/పామూరు/సీఎస్‌పురం(పామూరు): జాతిపితా మహాత్మా గాంధీ ఆశయసాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి దద్దాల, పార్టీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి పాలకులు గాంధీజీ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఘాటుగా విమర్శించారు. పేదవర్గాలకు సంక్షేమ ఫలాలు, గ్రామ స్వరాజ్యం కలగా మారాయని ధ్వజమెత్తారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను, సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని, పరిపాలనను అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు సానా రమణారెడ్డి, యూత్ జిల్లా నాయకులు ముల్లంగి రవీంద్రారెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పార్టీ వివిధ విభాగాల అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు కటికల వెంకట రత్నం, పల్నాటి భాస్కర్‌రెడ్డి, నాగమణి, మూలే రాజశేఖరరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీను, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, కలికాయ నారాయణ, దేవిరెడ్డి వెంకటస్వామి రెడ్డి, ఈర్ల శ్రీను, ఇండ్లా శ్రీకాంత్, కంటు కేశవ, భారతి, షకీలా, నాగూర్‌బీ, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసులో..

గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గంను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్‌లు అన్నారు. స్థానిక కార్యాలయంలో గాంధిజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, మేనేజర్ ఐ ప్రసాద్, ఇర్‌ఐ ప్రదీప్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సువర్ణ కుమార్, శానటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, మెప్మా టీఎంసీ రఘు, పులి శ్రీనివాసులరెడ్డి, పసుపులేటి అరుణోధర్, మున్సిపల్, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు. అలాగే వివిధ పార్టీలు, ఆర్యవైశ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతిపితా మహాత్మా గాంధి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పామూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

✔ పామూరులో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డిలు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంబటి కొండారెడ్డి, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయ బాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, గడ్డం వెంకట నారాయణరెడ్డి, ఇర్రి వినోద్‌రెడ్డి, శ్యామల మాల్యాద్రిరెడ్డి, మునగల రమణారెడ్డి, కోట వెంకటకృష్ణారెడ్డి, మేకంగి రత్తయ్య, వేముల మధు, షేక్.కాలేషా, మితికల బాలకృష్ణ, షేక్ రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

✔ సీఎస్‌పురం మండలంలోని ఆనికాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జలగం భారతి ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నారాయణం అలేఖ్య, షేక్ షహనాజ్ విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి

మర్రిపూడి: విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలని హెచ్‌ఎం తూగుట్ల భిక్షాల్‌రెడ్డి అన్నారు. స్థానిక గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీరాంమురళి రమేష్, ఆదినారాయణ, అమరేశ్వరిలు ఉన్నారు.


మున్సిపల్ ఆఫీసులో గాంధిజీకి నివాళులర్పిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్


మర్రిపూడిలో గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బాబూ నీ పాలన మోసాల డాబు

- హామీలు అమలు చేయక పోతే బుద్ధి చెప్పడం ఖాయం
- ప్రభుత్వ వైఫల్యంపై దద్దాల ధ్వజం

కనిగిరిరూరల్: నయవంచనే నైజంగా రాష్ట్రంలో బూటకపు పాలన సాగిస్తున్న చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్తారని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనతీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మోసపూరిత మాటలతో, బూటకపు హామీలతో గద్దెనెక్కడం ఆపై పాలనను గాలికి వదిలి వేయడం చంద్రబాబు సహజ నైజం అని తీవ్రంగా విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతో పేరితో రాష్ట్ర ప్రజలకు సున్నం పెట్టారని తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబు అధికారం చేపట్టిన 9 నెలల్లోనే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, రూ 1.19 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. సంపద సృష్టి పేరితో రాష్ట్రాన్ని తెలుగు తమ్ముళ్లు అడ్డంగా దోచుకుంటున్నారన్నారు. 1 ఏప్రిల్ 2024 ఎన్నికలకు కొన్నాళ్ల ముందు ఈనాడు దినపత్రిక ఒక కుహనా మేధావిని పట్టుకొచ్చి ఆయనకు ఎకనామిస్ట్ అనే బిళ్ల తగిలించి రాష్ట్రం అప్పు రూ.14 లక్షల కోట్లు అని అబద్ధం చెప్పించారన్నారు. 9 నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని చంద్రబాబు, కూటమి నేతలు చెప్పాలని ప్రశ్నించారు. హామీలు నెరవేర్చి మాట మీద నిలబడిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు ఇవాళ గుర్తు తెచ్చుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులతో 17 మెడికల్ కాలేజీలను తెచ్చారన్నారు. ఇకనైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు.


నారాయణ యాదవ్

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

సీఎస్‌పురం(పామూరు): అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం ఎంపీడీఓ అధ్యక్షన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు సీసీలు మండల అధికారులతో పథకాలు, గ్రామాల్లో సమస్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్‌లు బొట్లా చిరంజీవి, షేక్.ఖాదర్‌బీబుజ్జి, వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, అధికారులు పాల్గొన్నారు.

ఏడీఏపై చర్యలు తీసుకోవాలి

కనిగిరిరూరల్: ఏడీఏపై చర్యలు తీసుకోవాలని ఏహెచ్‌ఏలు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏహెచ్‌ఏ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు మాట్లాడుతూ అకారణంగా పీసీపల్లి మండలం వెంగళాయపల్లికి చెందిన దివ్యాంగుడైన ఏహెచ్ఏ (గ్రామీణ పశువైద్య సహాయకుడు) కే వెంకటేశ్వర్లు వినకూడని పదజాలంతో ఏడీఏ జీ శ్రీనివాసులరెడ్డి దూషించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఏడీఏ నోటి దురుసు వైఖరితోనే మనస్థాపానికి గురై వెంకటేశ్వర్లు ఆత్మహత్యాయత్నం చేసి అపస్మారక స్థితికి చేరాడన్నారు. ఏహెచ్‌ఏల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన ఏడీఏపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణం స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనల కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ సంఘ జిల్లా నాయకులు వాసు, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఏడీఏ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఏహెచ్‌ఏలు

ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్లు

కనిగిరిరూరల్: స్మార్ట్ మీటర్స్ వల్ల ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో గురువారం ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు గుజ్జుల బాలిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్ల చేత వెట్టి చాకిరి చేయించుకుని ప్రభుత్వాలు వారిని విస్మరిస్తున్నాయని ధ్వజమెత్తారు. అనంతరం నూతన డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా పీ పిచ్చయ్య, కార్యదర్శిగా అబ్దుల్, కోశాధికారిగా జి.ఎలీషా, ఉపాధ్యక్షుడు జి. ఐజాక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్‌లతో పాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుంచాల సిద్ధయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బీ నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ యాసిన్

నష్టాల్లో వేరుశనగ రైతులు


వేములపాడులో రాసులు పోసిన వేరుశనగ కాయలు


ఓదెలను కుప్పగా వేస్తున్న రైతు చిరంజీవి

- గతేడాది కంటే ఈ ఏడాది దిగజారిన ధర

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వం రాకతో రైతన్నలు కష్టాలు మామూలుగా లేవు. అన్నదాత సుఖీభవ లేదు.. గిట్టుబాటు ధర లేదు. ఏమి లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మండలంలో వేరుశనగ సాగు చేసిన రైతులకు నష్టలు తప్పడం లేదు. ఈ ఏడాది మండలంలోని వేములపాడు, మహమ్మదాపురం, రాజుగారిపల్లి, ముసలంపల్లి, ముక్కువారిపల్లి, గాయంవారిపల్లి, ఎలికవారిపల్లి, దాసరిపల్లి, రెండెంవారిపల్లి, లింగంగుంట్ల గ్రామాల్లో 1500 ఎకరాలో విస్తారంగా వేరుశనగ సాగు చేశారు. ఈ ఏడాది వర్షం దెబ్బతో సాగు చేసిన పంటలకు దిగుబడి తగ్గింది. గతేడాది కంటే ఈ ఏడాది వరుస తుఫాన్ దెబ్బతో కాయ దిగుబడి రాలేదు. కూటమి ప్రభుత్వం పెట్టుబడికి సాయం కూడా ఇవ్వలేదు. గత వైఎస్సార్ ప్రభుత్వం రైతుకు సాగుకు పెట్టుబడికి రైతు ఖాతాలో ముందుగానే రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్పులు చేసి తెచ్చి పెట్టు బడులు పెట్టారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ 20 వేలు పెట్టుబడి అయ్యింది. గత ఏడాది వేరుశనగ కాయ 37 కేజీల బస్తా రూ. 2700 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ప్రస్తుతం వేరుశనగ కాయకు 37 కేజీల బస్తా రూ.1800 ధరకు మించి ధర పలకడం లేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు చెప్తున్నారు. పెట్టుబడులు, కూలీల రేట్లు రెట్టింపుకావడం, దిగుబడి తగ్గడం, ఉన్నకాయకు గిట్టుబాటు ధర లేక పోవడంతో నష్టాలు తప్పవని వేరుశనగ రైతులు గొట్టిముక్కల చిరంజీవి, సాంబిరెడ్డి, కాశయ్య, కంది లాజరేష్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్లరాయి తరలిస్తున్న వాహనాలు సీజ్

పామూరు: మండలంలోని బోడవాడ రెవెన్యూలోని సర్వే నంబర్–4లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా తెల్లరాయిన తవ్వి తరలిస్తున మూడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు గురువారం తెలిపారు. తెల్లరాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న జేసీబీ, టిప్పర్, లారీ మొత్తం 3 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. దీనిపై మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

సమయపాలన పాటించని వైద్యులు


మూసి ఉన్న హెల్త్‌సెంటర్-3

సింగరాయకొండ: మండలంలోని హెల్త్ సెంటర్లలో ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నామని, కాని హెల్త్‌సెంటర్‌కు వెళితే మూసి ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధిలోని హెల్త్ సెంటర్‌కు వెళితే 12.10 గంటలకే మూసి ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఎప్పుడు తీస్తారో ఎప్పుడు మూస్తారో అర్థం కావడం లేదన్నారు. కావున ఇప్పటికైనా హెల్త్ సెంటర్లలో సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.